
## నిబంధనలు తుస్సు

2




2
## సన్నాలకు బోనస్ విడుదల చేయాలి



AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in


## మద్యం టెండర్లకు 34 దరఖాస్తులు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మద్యం షాపుల టెండర్ల కోసం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లాలో శనివారం 34 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని 102 వైన్ షాప్‌లకు గాను ఇప్పటి వరకు 149 దరఖాస్తులు వచ్చాయని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. నిజామాబాద్ స్టేషన్ పరిధిలో మొత్తం 36 వైన్ షాప్‌లకు 53 దరఖాస్తులు, బోధన్ స్టేషన్ పరిధిలో 18 దుకాణాలకు 23, ఆర్మూర్ పరిధిలో 25 వైన్ షాప్‌లకు 36, భీమ్‌గల్ పరిధిలో 12 షాప్‌లకు 22, మోర్తాడ్ స్టేషన్ పరిధిలో మొత్తం 11 దుకాణాలకు 15 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ పేర్కొన్నారు.





## శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద..

**అక్షరటుడే, మెండోరా:** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. జలాశయంలోకి వరద తగ్గడంతో అధికారులు గేట్ల ద్వారా నీటి విడుదలను నిలిపివేశారు. ప్రస్తుతం 10 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. దీంతో అధికారులు వరద గేట్లను మూసి వేశారు. ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ కు 4 వేలు, లక్ష్మి కాలువకు 200, సరస్వతి కాలువకు 650, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 709 క్యూసెక్కులు పోతుంది. మొత్తం ఔట్ ఫ్లో 9,790 క్యూసెక్కులుగా ఉంది. ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో దాదాపుగా సమానంగా ఉండడంతో ప్రాజెక్ట్ నీటిమట్టం నిలకడగా ఉంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1090.90 (80.05 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

## జల విద్యుత్ కేంద్రంలో కొనసాగుతున్న ఉత్పత్తి

**అక్షరటుడే, మెండోరా :** శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వద్ద ఉన్న తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో నిరంతరాయంగా కరెంట్ ఉత్పత్తి కొనసాగుతోంది. ప్రాజెక్ట్ నుంచి ప్రధాన కాలువైన ఎస్కేప్ గేట్ల ద్వారా 8000 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతోంది. ఈ నీటితో నాలుగు టర్బయిన్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని డీఈ శ్రీనివాస్ తెలిపారు. నాలుగు టర్బయిన్ల ద్వారా 36.42 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని ఆయన వివరించారు. ఒక్క రోజులో 0.8734 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. ఈ నెలలో 8.6762 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగిందని ఈ ఆర్థిక సంవత్సరంలో 49.6118 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి జరిగిందని వారు తెలిపారు. అయితే శనివారం సాయంత్రానికి కాకతీయ కాలువ ద్వారా 5వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 3వేల క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు.

## కాంగ్రెస్ పాలనపై ఎమ్మెల్యే ధన్‌పాల్ ఫైర్



**అక్షరటుడే, ఇందూరు:** కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి మరిచారని, కేవలం కమీషన్ల కోసం ఎగబడుతున్నారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా విమర్శించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనపై అన్ని వర్గాల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందన్నారు. ఎప్పుడూ లేనంత అవినీతి జరుగుతోందని ఆరోపించారు. రైతులకు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదన్నారు. వర్షాల వల్ల జిల్లాలో నష్టం వాటిల్లితే ఒక్క మంత్రి కూడా పరామర్శించలేదని, నష్టపరిహారం కూడా చెల్లించలేదని మండిపడ్డారు. జిల్లాలోని ఆర్వోబీలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు కొనసాగడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని జోరుగా ప్రచారం చేశారని.. కానీ అర్బన్ నియోజకవర్గంలో ఇప్పటికీ ఒక్క ఇల్లు ఇవ్వలేదన్నారు. గతంలో తాను మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేశానని వివరించారు. తక్షణమే 396 ఇళ్లు కేటాయించాలని ఆదేశించినా.. అధికారులు స్పందించలేదన్నారు. అలాగే బస్టాండ్ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించానని చెప్పారు. తాను సీఎం రేవంత్ రెడ్డిని కలవడానికి అనేక సార్లు ప్రయత్నించినా.. సమయం ఇవ్వలేదని ధన్‌పాల్ అన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకుడు న్యాలం రాజు, నాయకులు పాల్గొన్నారు.

దేశంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. పోలీసులు అనేక చర్యలు చేపడుతున్నా సైబర్ క్రైమ్‌లు మాత్రం ఆగడం లేదు. కేటుగాళ్లు ప్రజలను మోసం చేసి ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. దీంతో పోలీసు లు కఠిన చర్యలు చేపడుతున్నారు. సైబర్ నేరస్తులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తున్నారు. తాజాగా రాష్ట్రంలోనే తొలిసారి నిజామాబాద్ పోలీసులు ఓ సైబర్ నేరస్తుడిపై పీడీ యాక్ట్ ప్రయోగించారు.

- అక్షరటుడే, ఇందూరు



# సైబర్ నేరాలపై నజర్

▸ కఠిన చర్యలు చేపడుతున్న నిజామాబాద్ పోలీసులు ▸ రాష్ట్రంలోనే తొలిసారి పీడీ యాక్ట్ ▸ సైబర్ నేరాలు చేయిస్తున్న వ్యక్తిపై నమోదు

శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం.. దొంగతనాలకు పాల్పడడం.. తరచూ భయాందోళనలు కలిగించడం.. వంటి చర్యలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం సర్వసాధారణం. కానీ కొంతమంది తమ ప్రవృత్తిని మార్చుకోకుండా అదే తరహా నేరాలకు పాల్పడుతూ సమాజానికి చీడపురుగుల మారతారు. అటువంటి నేరస్తులపై కఠినమైన చర్యలు తీసుకుంటేనే మారే అవకాశం ఉంటుంది. సరిగ్గా ఇలాంటి ఒకరిపై జిల్లా పోలీసు యంత్రాంగం కఠినంగా వ్యవహరించింది. రాష్ట్రంలోనే తొలిసారిగా సైబర్ నేరగాడిపై పీడీ యాక్ట్ నమోదు చేసింది.

### కొత్త పద్ధతుల్లో..

టెక్నాలజీ ఎంత పెరుగుతుందో.. సైబర్ నేరాలు అంతగా పెరుగుతున్నాయి. ప్రధానంగా తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్, డిజిటల్ మార్కెటింగ్, డిజిటల్ అరెస్ట్, ఉద్యోగాల పేరుతో మోసాలు జరుగుతున్నాయి. అయితే చాలామంది అమాయకులు వీటిపట్ల ఆకర్షితులై లక్షల రూపాయలు మోసపోతున్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ.. డబ్బులను అధికంగా వచ్చే మార్గాన్ని చూపిస్తామంటూ అమాయకులను తమ ఉచ్చులో పడేసి సైబర్ దొంగలు అందిన కాడికి దండుకుంటున్నారు. దీంతో పోలీసులు ఇప్పటికే ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. తాజాగా నిందితులపై సైతం కఠిన చర్యలు తీసుకుంటున్నారు.


### విదేశాలకు పంపించి..

ప్రధానంగా తరచూ నేరాలకు పాల్పడుతూ సమాజానికి ప్రమాదకరంగా మారే వారిపై పీడీ యాక్ట్ (ప్రివెంటివ్ డిటెన్షన్) పెడతారు. ఇటువంటివారు కొంతకాలం పాటు బయటికి రాకుండా నిరోధించడానికి పీడీ యాక్ట్ ఉపయోగిస్తారు. సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారుల రిపోర్టు మేరకు పోలీస్ కమిషనర్ పీడీ ఉత్తర్వులను జారీ చేస్తారు. జిల్లాలో తరచూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న వ్యక్తిపై తొలిసారిగా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సైబర్ పీడీ యాక్ట్ నమోదు చేశారు. నాగ శివ అనే వ్యక్తి నిరుద్యోగ యువతకు కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి లావోస్, థాయిలాండ్ దేశాలకు పంపాడు. అక్కడికి వెళ్లిన తర్వాత వారి పాస్‌పోర్టు స్వాధీనం చేసుకొని చట్ట విరుద్ధంగా సైబర్ మోసాలు చేయాలని బలవంతం పెట్టేవాడని పోలీసు విచారణలో తేలింది. దీంతో జిల్లా నుంచి జారీ చేసిన ప్రివెన్షన్ డి టెన్షన్ ఆర్డర్‌ను రాష్ట్ర ప్రభుత్వం కన్ఫర్మేషన్ చేయడంతో నిందితుడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

### ఆరు నెలల్లో 33 కేసులు

జిల్లాలో సైబర్ బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈ ఏడాది మార్చి నుంచి సెప్టెంబర్ వరకు 33 కేసులు నమోదైనట్లు జిల్లా పోలీసు అధికారులు తెలిపారు. సుమారు రూ.5 కోట్ల మేర సైబర్ క్రైం జరిగినట్లు నిర్ధారించారు. ఇందులో ఇప్పటివరకు సుమారు రూ.90 లక్షలు రికవరీ చేశారు. అయితే కొంతమంది బాధితులు తాము మోసపోయామని బయటకు చెప్పడం లేదు. బాధితులు భయపడకుండా వెంటనే ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

### కఠిన చర్యలు తప్పవు



సైబర్ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. ప్రధానంగా బాధితులు మోసపోయినట్లు గ్రహిస్తే మొదటి గంటలో పోలీసులకు సమాచారం అందించాలి. దీంతో జాతీయ సైబర్ క్రైం హెల్ప్ లైన్ ద్వారా డబ్బులను రికవరీ చేసే అవకాశం ఉంటుంది. అలాగే సైబర్ నేరాలకు పాల్పడుతున్న నాగ శివపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపించాం.

– సాయి చైతన్య, పోలీస్ కమిషనర్



## విధుల నుంచి తొలగించడం అన్యాయం


**అక్షరటుడే, కామారెడ్డి:** పదేళ్లుగా ఆరోగ్యశ్రీలో విధులు నిర్వర్తిస్తున్న తమను విధుల నుంచి తొలగించడం అన్యాయమని ఆరోగ్యశ్రీ ఆపరేటర్లు ఆందోళన నిర్వహించారు. కామారెడ్డి జీజీహెచ్ వద్ద శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆపరేటర్లు మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీకి సంబంధించి పనులు మాత్రమే చేయాల్సి ఉన్నా.. ఇతర పనులు కూడా చేశామన్నారు. కరోనా లాంటి సమయంలో మాస్కులు, పీపీఈ కిట్స్ లేకున్నా పని చేశామన్నారు. అలాంటి తమను అకారణంగా విధుల నుంచి తొలగించడం సరికాదన్నారు. గతంలో ఉన్న ఆస్పత్రి సూపరింటెండెంట్లు తమను తొలగించకుండా సహకరిస్తూ వచ్చారన్నారు. కొత్తగా వచ్చిన సూపరింటెండెంట్ మాత్రం నియంతలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమస్యపై ఎవరికి ఫిర్యాదు చేసినా నన్నెవరు ఏమి చేయరని సూపరింటెండెంట్ అంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆపరేటర్లు సాయికుమార్, నర్సింలు, హరికుమార్, స్వరూప, ఆనంద్ పాల్గొన్నారు.



## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**అక్షరటుడే,బోధన్:** ఇటీవల కురిసిన వర్షాలకు బోధన్ నియోజకవర్గంలో రైతులు నష్టపోయారని.. వారికి తక్షణమే పరిహారం చెల్లించాలని బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు బోధన్ రైతులు తీవ్రంగా నష్టపోయారని వారికి ఇప్పటివరకు ఎటువంటి నష్టపరిహారం చెల్లించలేదన్నారు. రైతులకు నష్టపరిహారం చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సైతం పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. ఎన్నికల్లో తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలు నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 22 నెలలు గడుస్తున్నా ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని షకీల్ విమర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు బాకీ పడిందని కాంగ్రెస్ బాకీ కార్డులను ఆయన విడుదల చేశారు.





# అంతర్రాష్ట్ర ఫేక్ కరెన్సీ ముఠా అరెస్ట్..

**అక్షరటుడే, కామారెడ్డి:** సోషల్ మీడియా ద్వారా ఫేక్ కరెన్సీపై ప్రచారం చేస్తూ.. సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను కామారెడ్డి పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు వివరాలను శనివారం ఎస్పీ రాజేశ్ చంద్ర మీడియాకు వెల్లడించారు. పట్టణంలోని వైన్ షాపులో పనిచేసే అఖిల్‌కు గతనెల 23న ఓ వ్యక్తి వచ్చి రెండు నకిలీ 500 నోట్లను ఇచ్చి మద్యం తీసుకెళ్లాడు. తర్వాత గుర్తించిన అఖిల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. శాబ్దిపూర్ గ్రామానికి చెందిన సిద్దాగౌడ్ అనే వ్యక్తి దొంగనోట్లు ఇచ్చి మద్యం తీసుకెళ్లినట్టుగా గుర్తించి అతడిని విచారించారు. ఫేస్‌బుక్‌లో యాడ్ చూసి ఫోన్ చేయడంతో వెస్ట్ బెంగాల్‌కు చెందిన సౌరవ్‌డే తనకు రూ.5వేలకు రూ.10 వేల నకిలీ నోట్లు ఇస్తానని చెప్పాడన్నారు. గత నెల 18న కొరియర్ ద్వారా 18 నకిలీ నోట్లు పంపగా అందులో నుంచి రెండు నోట్లు తీసుకెళ్లి మద్యం కొనుగోలు చేసినట్లు చెప్పాడు. దీనిని సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ .. 8 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీఎస్ బృందం వెస్ట్ బెంగాల్ వెళ్లి సౌరవ్‌డేను గత నెల 27న పట్టుకుని విచారించగా హరి నారాయణ భగత్ అనే వ్యక్తితో కలిసి నకిలీ నోట్లను బీహార్‌కు చెందిన రషీద్ నుంచి కొరియర్ ద్వారా తెప్పించుకుని కస్టమర్లకు సరఫరా చేస్తున్నట్టు ఒప్పుకున్నాడు. సౌరవ్‌డే, హరి నారాయణ భగత్‌లను అరెస్ట్ చేసి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అనంతరం బీహార్‌కు వెళ్లిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో రషీద్‌ను పట్టుకున్నారు. ఈ ముఠా 2024లో రూ.2,17,000 నోట్లను సరఫరా చేసిందని ఎస్పీ తెలిపారు. ముఠాలో 12 మంది ఉన్నారని, అందులో రషీద్, కరెన్సీ కాట్నే, దివాకర్ చౌదరి, సత్యదేవ్ యాదవ్, సౌరవ్ డే, హరి నారాయణ భగత్, సిద్దాగౌడ్, కృతిక రాజ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కలకత్తా ఆపరేషన్‌లో స్వయంగా పాల్గొన్న ఏఎస్పీ చైతన్య రెడ్డిని ఎస్పీ అభినందించారు. నిందితుల నుంచి రూ.3,08,300 ఫేక్ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు.

# బీసీ రిజర్వేషన్లలో రాజీ పడే ప్రసక్తే లేదు: పీసీసీ చీఫ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** బీసీ రిజర్వేషన్ల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీవో నెం.9పై హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో సుప్రీంకోర్టుకు వెళ్లి అప్పీల్ చేసే యోచనలో ఉన్నామని తెలిపారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడంలో ప్రధాన ముద్దాయి బీజేపీ అని విమర్శించారు. కుల గణన సర్వే చారిత్రాత్మక నిర్ణయమన్నారు. సర్వేను పారదర్శకంగా నిర్వహించామని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే కుట్ర చేస్తున్నాయని వ్యాఖ్యానించారు. రెండు పార్టీలు కలిసి బీసీల నోటి కాడ ముద్దను లాగే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. మూడు చట్టాలు, ఒక ఆర్డినెన్స్ గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఢిల్లీ బీసీ రిజర్వేషన్ ధర్నాకు బీజేపీ నేతలు ఎందుకు మొఖం చాటేశారని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నాయన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే ఎన్నికలకు వెళ్తామని స్పష్టం చేశారు. బనకచర్ల విషయంలో ఒక చుక్క నీటిని కూడా వదులుకునే ప్రసక్తే లేదని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే బనక చర్ల జీవోలు వెలువడ్డాయని వివరించారు. నిజామాబాద్ జిల్లా అభివృద్ధికి పాలకతీతంగా కృషి చేస్తానని పీసీసీ చీఫ్ అన్నారు. హైదరాబాద్ నుంచి ముంబై వయా నిజామాబాద్ రైల్వే లైన్ విషయమై సీఎంతో చర్చించానని తెలిపారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, కాంగ్రెస్ నేతలు నగేశ్ రెడ్డి, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## దేవీ రోడ్డులో దుకాణాల బంద్..



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని దేవీ రోడ్డులో వ్యాపారస్తులు తమ దుకాణాలను శనివారం మూసివేసి నిరసన తెలిపారు. ఈ రోడ్డును వన్ వేగా ఏర్పాటు చేయడంతో తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా పోలీసులు ఇటీవల నగరంలోని పలు ప్రాంతాల్లో వన్ వే ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా దేవీ రోడ్డునూ వన్‌వేగా మార్చిన విషయం తెలిసిందే. దీంతో తమకు నష్టాలు వాటిల్లుతున్నాయని, వన్ వే తొలగించాలని వ్యాపారస్తులు పోలీసులను కోరారు.



## సన్నాలకు బోనస్ విడుదల చేయాలి

**అక్షరటుడే, కోటగిరి:** గత సీజన్లో సన్న వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ చెల్లించకపోవడంతో ఉమ్మడి కోటగిరి మండల రైతులు ఆందోళనకు దిగారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గత రబీ సీజన్‌లో రైతులకు ప్రకటించిన బోనస్‌ను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం సేకరణ వెంటనే ప్రారంభించాలని.. తరుగు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరారు. కార్యక్రమంలో రైతులు వల్లేపల్లి శ్రీనివాస్ రావు, తెల్ల రవికుమార్, ఏముల నవీన్, మోరే కిషన్, పుల్లెల మోహన్ రావు, నవీన్, శంకర్ గౌడ్, కాపుగండ్ల శ్రీనివాస్, దేవేందర్, శ్రీకాంత్, సాయి, శ్రీనివాస్ గౌడ్, కలీం, గంగా ప్రసాద్ గౌడ్, రమేష్, అరవింద్, ఫారుక్, గజేందర్, రైతులు పాల్గొన్నారు.



## బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలను విడుదల చేయాలి

**అక్షరటుడే, బోధన్:** బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలను విడుదల చేయాలని విద్యార్థి సంఘాల జేఏసీ ఛైర్మన్ నాగరాజు, జేఏసీ కన్వీనర్ గౌతమ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిరువురు మాట్లాడుతూ..ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ పేద విద్యార్థులు విద్యనభ్యసించేందుకు బెస్ట్ అవైలబుల్ స్కీంను ప్రభుత్వం గతంలో తీసుకొచ్చిందన్నారు. అయితే కొన్నేళ్లుగా స్కీం కింద నిధులు విడుదల చేయడంతో విద్యార్థులు భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



## చందాలు వేసుకుని.. బోరు బాగు చేయించుకుని..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** వెల్లుట్ల గ్రామంలోని నాలుగు వార్డులకు నీటిని అందించే బోరు మోటార్ పాడైంది. దీంతో ఆయా కాలనీల వాసులు సబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ వారినుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో స్వయంగా కాలనీవాసులే ముందుకొచ్చారు. చందాలు వేసుకుని బోరు మోటారు రిపేర్ చేయించుకున్నారు. బోరుకు కొత్త స్టార్టర్ బాక్స్‌ను బిగింపజేశారు. నీళ్ల కోసం ఎన్ని అవస్థలు పడ్డప్పటికీ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడలేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



## గ్రూప్–1 ర్యాంకర్ దొనుపుల కిరణ్‌కు ఘనసన్మానం

**అక్షరటుడే, ఇందూరు:** ఇటీవల వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో నగరంలోని గంగాస్థాన్ ఫేజ్-2కు చెందిన దొనుపుల కిరణ్ అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా ఆయన కామారెడ్డి ఆడిట్ కార్యాలయంలో పోస్టింగ్ పొందారు. ఈ మేరకు గంగాస్థాన్ ఫేజ్-2లోని రాజారాణి అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం దొనుపుల కిరణ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్, ఉపాధ్యక్షుడు ఎన్ గంగాధర్, ప్రధాన కార్యదర్శి చంటి రమేశ్ మాట్లాడుతూ.. తమ కాలనీకి చెందిన వ్యక్తి గ్రూప్-1లో ఉద్యోగం సాధించడం గర్వంగా భావిస్తున్నామన్నారు. దొనుపుల కిరణ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలు సాధించి కాలనీకి పేరు తేవాలని కోరుతున్నామన్నారు. ఆయన గ్రూప్-1లో ఉద్యోగం సాధించి ఎంతోమంది యువతకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.





# నిబంధనలు తుస్సు

■ ఇష్టారాజ్యంగా టపాసుల దుకాణాల ఏర్పాటు ■ నగరంలోని కిషన్ గంజ్‌లో ఏర్పాటు చేస్తున్న పలువురు ■ ఏళ్లు గడుస్తున్నా.. మారని తీరు

**నగరంలో రద్దీ ప్రాంతాల్లో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. నిబంధనలు పాటించకుండా జనావాసాల మధ్య పటాకులు విక్రయిస్తున్నారు. దీపావళి వచ్చిందంటే చిన్నా పెద్ద తేడా లేకుండా టపాసులు కాలుస్తారు. దీంతో చాలా ప్రాంతాల్లో తాత్కాలికంగా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేస్తారు. అయితే రద్దీ ప్రాంతాల్లో దుకాణాలు పెట్టొద్దనే నిబంధన ఉంది. అయినా కొందరు వ్యాపారులు పట్టించుకోవడం లేదు. జిల్లా కేంద్రం నడిబొడ్డున కొందరు వ్యాపారులు పాతుకుపోయారు. ఏళ్లు గడుస్తున్నా.. తీరు మారడం లేదు. అయినా అధికారులు కూడా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.**

**- అక్షరటుడే, ఇందూరు**

జిల్లా కేంద్రంలోని కిషన్ గంజ్ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. అన్ని రకాల హోల్‌సేల్ దుకాణాలు ఇక్కడ ఉంటాయి. దీంతో నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల వ్యాపారస్తులు వస్తుంటారు. అలాగే చుట్టుపక్కల, దుకాణాలపై పలు కుటుంబాలు నివసిస్తుంటాయి. అలాంటి ప్రదేశంలో పటాకుల దుకాణాలు ఏళ్ల తరబడి ఏర్పాటు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం జనావాసాలు, నివాస ప్రాంతాల్లో టపాసుల దుకాణాలకు అనుమతి లేదు. కానీ నగరంలో మాత్రం యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. వ్యాపారస్తులు మాత్రం తమకు అనుమతులు ఉన్నాయంటూ బుకాయిస్తున్నారు.

### జాగ్రత్తలు అంతంతే...

నగరంలోని కిషన్ గంజ్‌లో సుమారు ఆరు దుకాణాలు ఉంటాయి. ఇందులోనూ సేఫ్టీ అంతంత మాత్రంగానే ఉంది. దుకాణాల ముందు ఒకటి రెండు మంటలను ఆర్పే సిలిండర్లను ఉంచారు. ఒకవేళ జరగరానిది ఏదైనా జరిగితే ఫైర్ ఇంజిన్ కూడా అతి కష్టంపైన లోపలికి వచ్చే పరిస్థితి. ప్రతి సంవత్సరం అగ్నిమాపక, పోలీసు శాఖలు ప్రకటనలు విడుదల చేయడమే తప్ప, నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడం లేదు. వ్యాపారస్తులు కేవలం దుకాణాలు నిర్వహించడమే కాకుండా.. వాటికి సమీపంలోనే ఎవరికి తెలియకుండా గోదాములు కూడా ఏర్పాటు చేశారు. అందులో పెద్ద ఎత్తున పటాకులను నిలువ చేసుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. నగర శివారులోని మాధవ నగర్ బైపాస్‌లో పలువురు వ్యాపారస్తులు నిబంధనల ప్రకారం సొంత భవనాలు నిర్మించుకున్నారు. కానీ దీపావళి సీజన్‌లో మాత్రం కిషన్ గంజ్‌లో వ్యాపారం చేస్తున్నారు.

### ఇవీ నిబంధనలు..

- టపాసుల దుకాణాలు జనావాసాలకు రద్దీ ప్రాంతాలకు దూరంగా ఉండాలి.
- దుకాణం ఒకే నిర్మాణంలో ఉంటే పొరుగు వారి నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలి.
- అగ్నిమాపక శాఖ, పోలీసులు, బల్దియా నుంచి అనుమతులు తీసుకోవాలి.
- దుకాణానికి అత్యవసర మార్గం తప్పనిసరిగా నిర్మించాలి.
- లైసెన్స్ లేకుండా టపాసులు అక్రమంగా నిల్వ చేయొద్దు.
- అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే.. మంటలను ఆర్పడానికి నీళ్లు, డ్రై కెమికల్ పౌడర్ సిలిండర్లు, ఇసుక బకెట్లు ఉంచుకోవాలి.
- అగ్నిమాపక శాఖ సూచించిన విధంగా భద్రత నిబంధనలు పాటించాలి.



## పీసీసీ చీఫ్‌ను కలిసిన పద్మశాలి మహిళా సంఘం ప్రతినిధులు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను జిల్లా పద్మశాలి మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని ఆర్అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో జిల్లా మహిళా పద్మశాలి సంఘం అధ్యక్షురాలు చాట్ల అన్నపూర్ణ ఆధ్వర్యంలో పీసీసీ చీఫ్‌ను సన్మానించారు. అనంతరం మహిళా సంఘం ప్రతినిధులు సంఘానికి సంబంధించి పలు సమస్యలను వివరించి పరిష్కారానికి కృషి చేయాలని మహేష్ కుమార్ గౌడ్‌ను కోరారు. కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం సెంట్రల్ కమిటీ సభ్యుడు దాసరి నర్సింలు, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు మైసల నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు గంగా ప్రసాద్, సహాయ కార్యదర్శి పద్మ సుభాష్, మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు బైస రమాదేవి, ప్రచార కార్యదర్శి గిరిజ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.




## కల్లుగీత వృత్తిపై కేంద్రం చిన్నచూపు

**అక్షరటుడే, కామారెడ్డి :** దేశీయ వస్తువులనే వాడాలని చెప్పే కేంద్ర ప్రభుత్వం ప్రకృతి పానీయాలైన నీరా, కల్లును ఎందుకు ప్రోత్సహించడం లేదని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ ప్రశ్నించారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో శనివారం గీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇన్నేళ్లలో కేంద్రంలోని బీజేపీ సర్కారు ఒక్క పథకమైనా గీత కార్మికుల సంక్షేమానికి ప్రవేశపెట్టిందా అని ప్రశ్నించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులను కోటీశ్వరులను చేస్తామంటున్నారని, కల్లుగీత సొసైటీ సభ్యుల గురించి ఎందుకు ఆలోచించరని ప్రశ్నించారు. తమ వృత్తిని ఆధునికరించి నీరా, తాటి, ఈత ఉత్పత్తులను ప్రోత్సహించి యువతీ యువకులకు ఉపాధి కలిగించే ఆలోచన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి సిరిపురం రమేష్ మాట్లాడుతూ.. చెట్ల పెంపకానికి సొసైటీకి ఐదు ఎకరాల చొప్పున భూమి ఇచ్చి హైబ్రిడ్ తాటి, ఈత వనాలు పెంచాలన్నారు. కల్తీకల్లు పేరుతో కల్లు దుకాణాలపై ఎక్సైజ్ అధికారులు చేస్తున్న దాడులను వెంటనే డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు వెంకట్ గౌడ్, ఉపాధ్యక్షుడు యాదగిరి గౌడ్, రవీందర్ గౌడ్ శంకర్ గౌడ్, మోహన్ గౌడ్, కార్యదర్శులు రమేష్ గౌడ్, రాజా గౌడ్, స్వామి గౌడ్, హన్మాగౌడ్, కృష్ణాగౌడ్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ కాలువలో మహిళ మృతదేహం లభ్యం

**అక్షరటుడే, మెండోరా:** మండలంలోని కాకతీయ కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉన్నట్లుగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీయించారు. సుమారు 55 ఏళ్ల నుంచి 60ఏళ్ల మధ్య వయస్సున మహిళపై లేత ఆకుపచ్చ చీర ఉందని.. ఎడమ చేతిపై పచ్చబొట్టు ఉందని పోలీసులు తెలిపారు. ఇటీవల ఎవరైనా అదృశ్యమైనా.. ఎలాంటి అనుమానమున్నా ఆర్మూర్ రూరల్ సీఐ 8712659859, మెండోరా ఎస్సై 8712659864లను సంప్రదించాలని సూచించారు.




ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న సలీం




నిజామాబాద్‌లో..

## స.హ. చట్టం.. వజ్రాయుధంలాంటిది..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** సమాచార హక్కు చట్టం ప్రజల చేతుల్లో వజ్రాయుధం లాంటిదని డీఎస్పీ శ్రీనివాసరావు, స.హ. చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం అన్నారు. ఎల్లారెడ్డి డీఎస్పీ కార్యాలయంలో శనివారం స.హ. చట్టం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 5వ తేదీ నుంచి 12వ తేదీ వరకు స.హ. చట్టం వారోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. ఎల్లారెడ్డి డివిజన్‌లోని అన్ని పోలీస్ స్టేషన్లలో సమాచార హక్కు చట్టం బోర్డులు ఉన్నాయని తెలిపారు. ప్రజలకు కావాల్సిన సమాచారం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి సీఐ రాజిరెడ్డి, లింగంపేట్ మండల సబ్ ఇన్‌స్పెక్టర్ దీపక్ కుమార్, స.హ. చట్టం పరిరక్షణ కమిటీ ప్రతినిధులు లింగమయ్య, షేక్ మదర్ పాష, మొహమ్మద్ ఇంతియాజ్, మహమ్మద్ మసూద్, యాదగిరి గౌడ్, శ్రీకాంత్,మోహన్ రెడ్డి, షేక్ అయూబ్ పాల్గొన్నారు.

### నిజామాబాద్ నగరంలో..

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ :** స.హ. చట్టం వారోత్సవాలను నగరంలోని మాణిక్ భవన్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌టీఐ రాష్ట్ర సలహాదారుడు కేతు రమణారెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం స.హ.చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ సలీం మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని డివిజన్లలో, మండలాల్లో చట్టం వార్షికోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స.హ. చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర స్పోక్స్‌పర్సన్ కాంతపు గంగాధర్, మహిళా న్యాయ సలహాదారులు శ్యామల, మహిళా అధ్యక్షురాలు సునీత తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు సెల్‌ఫోన్ల అందజేత



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండల పరిధిలో ఇటీవల చోరీకి గురైన రెండు మొబైల్ ఫోన్లను గుర్తించి, బాధితులకు అందజేసినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్లు చోరీకి గురైతే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితుల ఫోన్లు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తిరిగి పొందే అవకాశం ఉందన్నారు. రికవరీ చేయడంలో కృషి చేసిన మహిళా పోలీస్ కానిస్టేబుల్ వసుధను ఎస్సై అనిల్ రెడ్డి అభినందించారు.




## సుందరయ్య కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని సుందరయ్య కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అంకాపూర్‌లోని ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి నివాసంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేశ్ మాట్లాడుతూ.. యానంగుట్ట సుందరయ్య కాలనీలో పదేళ్లుగా పేదలు సర్వే నం. 41/59లో గుడిసెలు వేసుకుని నివాసముంటున్నారన్నారు. వారి ఇళ్లకు కనీసం కరెంటు సౌకర్యం లేదన్నారు. కాలనీలో ఎలాంటి సదుపాయాలు లేవని వాపోయారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రవి, సాయిలు, సాజిద్ ఖాన్, నదీం, లక్ష్మీ, షాహిదా బేగం, రజియా సుల్తానా, సునీత, అనిత తదితరులు పాల్గొన్నారు.



## రేపు పద్మశాలీల అలయ్ బలయ్

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని క్షత్రీయ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆర్మూర్ పట్టణ పద్మశాలీల అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మ్యాక మోహన్ దాస్ ఆధ్వర్యంలో ఈఆర్ ఫౌండేషన్ ఛైర్మన్, చార్టెడ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్‌ను కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. అనం తరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఫౌండేషన్ తరపున అన్నదానం కార్యక్రమానికి ముందుకు రావడంపై సంఘం సభ్యులు రాజశేఖర్‌ను అభినందించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కొక్కుల రమాకాంత్, ఆర్మూర్ పట్టణ సర్వ సమాజ సంఘ సభ్యులు ఐడియా సాగర్, పట్టణ రెండో సంఘం అధ్యక్షుడు బండి అనంత రావు, ఎల్ఐసీ భాస్కర్, ప్రభాకర్ పాల్గొన్నారు.



## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**అక్షరటుడే, బాల్కొండ:** విద్యార్థులు అనవసర యాప్‌ల జోలికి వెళ్లి సైబర్ నేరగాళ్లకు చిక్కవద్దని ఎస్సై శశిధర్ సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో సైబర్ క్రైంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల భద్రతకు అనేక చట్టాలున్నాయన్నారు. విద్యార్థినులు, మహిళలకు ఎలాంటి ఆపద వచ్చిన వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి భవాని మాట్లాడుతూ సైబర్ క్రైంపై అవగాహన కల్పించిన ఎస్సై శశిధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.